48)సామంతం/కాంభోజి

ప॥ అలుక లేటికి రావే యాతనివద్దకి నీవు। బలిమైతే వలపులు పదనుకు వచ్చునా॥

చ॥ సంగడి నున్న సతికి చనవులు గలుగుగాక। కంగి కడనుండితేను కలదా పొందు।
చెంగటనున్న రుచులు చేరి నోరూరించుగాక। అంగడినున్న సొమ్ములు ఆసలు పుట్టించునా॥

చ॥ వినయపుటింతికిని వేడుక లీడేరుగాక।పెనగుచు బిగిసితే ప్రేమపుట్టునా।
తనువున బూసిన గందము చల్లనౌగాక। వనములో తరువులు వడదీర్చవోపునా॥

చ॥ సేవచేసే మగువకు చేతలెల్లా జెల్లుగాక। యీవల నొడ్డారించితే నింపు వుట్టునా।
శ్రీవేంకటేశుడిందు విచ్చేసి తానిన్నుగూడెను। పూవులు పిందెలౌగక పొల్లు వెలవెట్టునా॥